క్లుప్తంగా

స్విమ్మింగ్ కోచ్ గణేష్‌కు వీడ్కోలు



స్విమ్మింగ్ కోచ్ గణేష్‌ను సన్మానించిన అధికారులు

ఏలూరు రూరల్: స్విమ్మింగ్ కోచ్ గణేష్ ఎన్నో ఏళ్లుగా బాలబాలికలకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో జిల్లాకు పతకాలు అందించారని సెట్‌వెల్ సీఈఓ మెహర్రాజ్ కొనియాడారు. ఇటీవల పదవీ విరమణ చేసిన గణేష్‌కు బుధవారం ఏలూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ స్విమ్మింగ్ క్రీడాంశంలో గణేష్ సేవలు అభినందనీయమన్నారు. పలువురు శిక్షకులు, సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు గణేష్‌కు శాలువ కప్పి మెమెంటో అందించి వీడ్కోలు పలికారు.

న్యూ ఇందిరాకాలనీ వాసుల ఆందోళన

ఏలూరు రూరల్: ఏలూరు సుంకరవారితోట న్యూ ఇందిరాకాలనీలో నివాసాల మధ్య చర్చి నిర్మించవద్దంటూ స్థానికులు బుధవారం ఆందోళన చేపట్టారు. హిందూ సంఘాల ఐక్య వేదిక పేరిట రామనపూడి శివప్రసాద్, కేఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, లక్కోజు అనిల్, ఆడపా సురేష్ తదితరులు, మరికొందరు కాషాయ జెండాలు చేతబూని తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరి నినాదాలు చేశారు. హిందువులు నివసించే ప్రాంతంలో చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని తహసీల్దార్ కార్యాలయ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి



ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీఓ

దెందులూరు: ఉపాధి పనులు వేగవంతంగా లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఏపీఓ దశరథ రామ్‌జీ అన్నారు. బుధవారం చల్లచింతలపూడిలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్‌తో కలిసి అమృత సరోవర్ పథకం పనులను పరిశీలించారు. మస్తర్లు పరిశీలించారు. పనులపై ఆరా తీశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు సమన్వయం, ప్రణాళికతో ఉపాధి హామీ పథకం లక్ష్యాలు సాధనకు కృషి చేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన అడ్మిషన్లు

- పలు స్కూళ్లలో దొరకని సీట్లు
- ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ



పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో మరో విద్యా విప్లవానికి తొలి అడుగు పడింది. 2023–24 విద్యా సంవత్సరం ఆరంభమై విజయవంతంగా కొనసాగుతోంది. ఉష్ణోగ్రతల ప్రభావంతో ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నారు. బడి తెరిచిన రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక (పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, బూట్లు, టైలు, డిక్షనరీ తదితర విద్య సంబంధిత వస్తువులు) పంపిణీ ప్రారంభించారు. మెనూ ప్రకారం విద్యార్థులు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు వడ గాలుపులు తగలకుండా రాగి జావ పంపిణీ, పోషకాల కోసం చిక్కీ, కోడిగుడ్లు కూడా పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తోన్న విద్యాసంస్కరణల ఫలితంగా ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అడ్మిషన్లు గణనీయంగా పెరిగాయి. ప్రారంభం రోజునే 50 శాతానికి పైగా, ప్రస్తుతం 75 నుంచి 80 శాతానికి అడ్మిషన్లు పెరిగాయి. గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాలను పరిశీలించిన తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రమాణాల మేరకు విద్యా బోధన చేస్తున్నట్టు గ్రహించారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చి చేరడంతో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు నిండుకుంటున్నాయి. ఏలూరు రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతుల్లో సీట్లు దొరకని పరిస్థితి నెలకొందంటే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు ఉన్న నమ్మకం అవగతమౌతుంది.

ఏలూరు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థులు

పాఠశాలలు	ఏలూరు రూరల్	అర్బన్
ప్రాథమిక	38	49
ప్రాథమికోన్నత	10	3
ఉన్నత	9	13
విద్యార్థులు	7,335	10,424

ప్రవేశాలు పెరిగాయి



ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల కాలంలో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. రూరల్ పరిధిలోని సత్రంపాడు, శనివారపు పేట, నగరంలోని కస్తూరిబా గాంధీ బాలికోన్నత పాఠశాల, గాంధీనగర్ మున్సిపల్ పాఠశాల తదితర పాఠశాలల్లో 9, 10వ తరగతుల్లో సీట్లు ఖాళీ లేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాల అమలుతో బడులు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి.

– రూపావత్ రంగయ్య, ఏలూరు రూరల్ మండల విద్యాశాఖాధికారి

టెన్త్‌లో సీట్లన్నీ భర్తీ



ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా ప్రమాణాల్లో సమూల మార్పులు వచ్చాయి. బోధనా సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయుల ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహిస్తోంది. ఇటీవల విడుదలైన 10 ఫలితాల్లో మా విద్యార్థిని కొనరాజు చిహ్నిత 581 మార్కులతో నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో సీట్లు అన్నీ భర్తీ అయిపోయాయి.

– జి.సునీత, కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

యోగాతో మానసిక రుగ్మతలు దూరం



న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఆసనాలు వేస్తున్న జడ్జి పురుషోత్తమ్‌కుమార్ తదితరులు



ప్రాణాయామం చేస్తున్న సీఆర్ఆర్ కళాశాల విద్యార్థినులు



ఏఎస్ఆర్ స్టేడియంలో యోగాసనాలు వేసిన వాకర్స్



టీటీడీసీలో నిర్వహించి యోగా డేలో పాల్గొన్న డీఆర్ఓ సత్యనారాయణమూర్తి

ఏలూరు (టూటౌన్): యోగా ద్వారా మానసిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ సి.పురుషోత్తమ కుమార్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పురుషోత్తమ కుమార్ మాట్లాడారు. ప్రస్తుత యాంత్రిక జీవనంలో ఒత్తిడిని జయించేందుకు యోగా కీలకమైందన్నారు. యోగా ద్వారా శారీరక ధృడత్వం పొందవచ్చన్నారు. యోగా శిక్షకుడు వెదుళ్ల రాంబాబు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి యోగాశిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్, పలువురు న్యాయమూర్తులు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మెరుగైన జీవితం

ఏలూరు(టూటౌన్): యోగాసానాల సాధనతో మెరుగైన జీవనాన్ని పొందవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎన్ఎస్ మూర్తి అన్నారు. స్థానిక వట్లూరు టీటీడీసీ, డీఆర్‌డీఏ హాలులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత డీఆర్ఓ జ్యోతిప్రజ్వలన చేసి యోగా దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులతో యోగా శిక్షణ మాస్టర్ వి.ధర్మారావు యోగాసానాలు వేయించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పీవీవీఎస్ఎన్ చౌదరి, డాక్టర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో యోగాసనాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. సీఆర్ఆర్ మహిళా కళాశాలలో యోగా గురువు వేణుగోపాలునాని విద్యార్థులకు యోగాసనాల ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ పి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ సురాధ తదితరులు పాల్గొన్నారు. రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల, సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్, సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో యోగా డేను నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ పార్కులో యోగా గురువు సాంబశివరావు స్థానికులచే ఆసనాలు వేయించి వాటి ఉపయోగాల్ని వివరించారు. ఈ సందర్భంగా యోగా గురువు సాంబశివరావు, బృందావన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు జ్ఞాపికలు బహూకరించారు. రాజయోగిని బీకే లావణ్య, బీకే బిందు పాల్గొన్నారు. ఈ సందర్భంగా

ఉత్సాహంగా యోగా డే

ఏలూరు రూరల్: పలు ప్రభుత్వ శాఖల అధికారులు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఫ్లాష్, ఏఎస్ఆర్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సౌజన్యంతో యోగాసనాలు వేశారు. ఇండోర్ స్టేడియంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి దూలం కిషోర్ ఆధ్వర్యంలో యువకులు, వృద్ధులు, మహిళలు ఆసనాలు వేశారు. యోగాలో ప్రతిభ చాటిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో నమ్మిన నాగార్జున, మేతర అజయ్‌బాబు, పి.కొండలరావు, మోహన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి యత్నించడం దారుణం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా శెట్టిబలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడి దుర్గారావుపై ఇటీవల కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నం చేయడానికి ప్రయత్నించడం దారుణమని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. పవరుపేటలో దుర్గారావు ఆటో మొబైల్ విడిభాగాల షాపును నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 17న సాయంత్రం ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు షాపువద్దకు వచ్చి దుర్గారావు గురించి అడిగారని తెలిపారు. ఆ సమయంలో షాపులో ఆయన లేకపోవడంతో దుర్గారావు భార్య, షాపులో ఉన్న వ్యక్తులపై దుర్భాషలాడి దుర్గారావును చంపేస్తామంటూ వెళ్లిపోయారని వివరించారు. ఈ ఘటనలో సీసీ కెమెరాలో రికార్డయిందని, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించారని చెప్పారు. అనుమానితులు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఈ కేసులో పూర్తి విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. సమావేశంలో సంఘం ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతపల్లి రామకృష్ణరాజు, ఉపాధ్యక్షుడు పిల్లి ప్రసాద్, నాయకులు జోగి నరేంద్ర, గుబ్బల రాము, ఎ.సత్తిబాబు, యాంద్ర లక్ష్మీనారాయణ, కేతా శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఎఫ్ హర్షం

దెందులూరు: ప్రతి రెవెన్యూ డివిజన్ ఒక ఉపవిద్యాశాఖాధికారి (డీవైఈఓ) పోస్టును మంజూరు చేస్తూ జీఓ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌టీఎఫ్ కృతజ్ఞతలు తెలిపింది. పరిపాలనా వికేంద్రీకరణ, పాలనా సౌలభ్యం, ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభివృద్ధి, సౌకర్యం దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం స్వాగతిస్తున్నామని వైఎస్సార్ సీపీ టీఎఫ్ దెందులూరు నాయకులు రాబర్ట్, దాసు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

జంగారెడ్డిగూడెం : ఐరన్ ఊసలు లోడుతో వెళుతున్న ఆటో బోల్తా పడడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. బుధవారం జంగారెడ్డిగూడెం పేరం పేటరోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆటో తిరగబడటంతో వెనకాల కూర్చొని లక్కవరం గ్రామానికి చెందిన మల్లెల్లి వెంకట్రావు అనే వ్యక్తిపై ఐరన్ ఊసలు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వెంకట్రావును స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం

కొయ్యలగూడెం : రాజవరం గ్రామ పంచాయతీ వైఎస్సార్ సీపీ కమిటీ మృతి చెందిన సీనియర్ కార్యకర్త కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం బుధవారం అందజేసింది. గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త, చల్లా రామయ్య (65) ఇటీవల మృతి చెందారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు తెలిపారు. దీంతో రామయ్య కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన సహాయం వెంటనే అందజేయాలని సంబంధిత శాఖాధికారులకు జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి సూచించారు. కుటుంబఅవసర తాత్కాలిక ఖర్చుల నిమిత్తం గ్రామ కమిటీ ఆర్థిక సహాయం అందజేసింది అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాముల నాగముని స్వామి, శ్రీరంగం విశ్వనాథం, అనంతల సుబ్బారావు, నేలపోలు సూరిబాబు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	42	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	07-10
బెండకాయలు	30	కంద	48
పచ్చిమిర్చి	80-90	బీట్‌రూట్	44
కాకర కాయలు	50	కీరా దోస	44
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25-45
క్యారెట్	44	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	18	బజాజీ	--
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	74
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	18

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	--
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



చిన్నారికి రక్తమార్పిడి చికిత్స అందిస్తున్న రెడ్‌క్రాస్ వైద్యులు

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో 10 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించారు. అమెరికా నుంచి వచ్చిన నాన్సీలిన్, అబిగైల్ జియానా, ప్రణయ రెడ్డి, అఖిల్ రెడ్డి జిల్లా రెడ్‌క్రాస్ కార్యాలయాన్ని, తలసేమియా భవనాన్ని బుధవారం సందర్శించారు. తలసేమియా బాధిత చిన్నారులకు అందుతోన్న చికిత్సను పరిశీలించి, చిన్నారులను పరామర్శించారు. అమెరికాలోనూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స, విపత్తుల నిర్వహణ అంశాలపై శిక్షణ ఇస్తూ సేవలు అందిస్తారని వారు తెలిపారు. తలసేమియా చిన్నారులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులు, సహాయకులు 30 మందికి మధ్యాహ్నం ఉచితంగా భోజనం అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, బి.పద్మజా, సిబ్బంది ఉన్నారు.

రైతులకు సీసీఆర్‌సీ కార్డుల అందజేత



చొదిమెళ్లలో హక్కు పత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత గల ప్రతి రైతుకూ పంటసాగు హక్కు పత్రం అందిస్తామని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. బుధవారం చొదిమెళ్ల రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కౌలు రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏలూరు మండలంలో 1700 మంది కౌలు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని నిర్ణయించామని, ఇప్పటి వరకు 1424 మందికి పత్రాలు అందించామని చెప్పారు. మరో 276 మంది అందించాల్సి ఉందని చెప్పారు. అత్యధికంగా మల్కాపురంలో 436, పోణంగిలో 303, వెంకటాపురంలో 204, చాటపర్రులో 188, చొదిమెళ్లలో 184, జాలిపూడిలో 155, మాదేపల్లిలో 100 మంది రైతులు హక్కుపత్రాలు అందుకున్నారని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో అత్యల్పంగా ఉన్నారన్నారు. ఈ పత్రాల ద్వారా బ్యాంకుల ద్వారా పంట రుణం అందుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బత్తిన విజయకుమార్, వీఆర్వో తాడి ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సౌజన్య రైతులకు హక్కు పత్రాలు అందజేశారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



మహిళ సమస్యను వింటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీ ఈదురుగాలులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్వహించిన కార్యక్రమానికి అడుగడుగునా ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి, చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా దాదాపు 600 హామీలను మేనిఫెస్టోలో పెట్టుకుని ఏ ఒక్క హామీని నెరవేర్చని చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు. ప్రతి విషయంలో రైతులకు పెద్దపీట వేశామని, గతంలో రైతు రుణమాఫీ పేరుతో అన్నదాతను టీడీపీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, సొసైటీ అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు మేకా గంగాధరరావు, జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యురాలు చోడిశెట్టి ప్రభావతి, మేకా వసంత్, చోడిశెట్టి వెంకటేశ్వరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సొంగ సోమేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ తాళం వెంకటేశ్వరరావు, సుబానీ, మస్తాన్, కాసిం, మోతీ, జగదీష్, పరసా వరలక్ష్మీ పాల్గొన్నారు.

ఫైనాన్షియల్ లిటరసీలో విద్యార్థినుల ప్రతిభ



సర్టిఫికెట్లు, నగదు అందిస్తున్న హెచ్‌ఎం

దెందులూరు: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్వహించిన ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ– 2023 అంశంపై పోటీలు బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ పోటీల్లో దెందులూరు పాఠశాల విద్యార్థినులు శలాది నాగవెంకట అపర్ణ, తాబేలు లక్ష్మి అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందారు. విద్యార్థినులను హెచ్‌ఎం పి.శ్రీదేవి, ఎంఈఓ–1 సీహెచ్ బుద్ధవ్యాస్ అభినందించారు.

ఆలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల్లో మృతి చెందిన సాధిర్ ఆలీ కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల వద్ద బుధవారం కార్మికులు ధర్నా చేశారు. మంగళవారం రాత్రి పనిచేస్తుండగా సాధిర్ ఆలీ అనే బెంగాల్ వలస కార్మికుడు మృతి చెందాడన్నారు. మేఘా కంపెనీ, దాని సబ్‌కాంట్రాక్టర్లు మృతుని కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, సీపీఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. నాయకులు బి.జగన్నాథం, వి.సాయిబాబు, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోండి

జంగారెడ్డిగూడెం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న ప్రీ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ అన్నారు. జంగారెడ్డిగూడెం 2వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న గుడ్లు, పాలు, వైఎస్సార్ కిట్, బాలామృతం తదితర పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. స్టాకు రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిబాల పద్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలను తల్లిదండ్రులు, బాలింతలు, చిన్నారులు, కిషోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసు లోపు ఉన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి, ప్రీ స్కూల్ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పెసరగంటి గంగ, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా, సూపర్‌వైజర్ ఎం.మంగతాయారు, అంగన్‌వాడీ టీచర్ టి.వరలక్ష్మి, షేక్ లక్ష్మీబీబీ, తల్లులు, ప్రీస్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com